
ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసిన ఎల్‌ఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ముషీరాబాద్ అభివృద్ధిలో
కాలనీ సంఘాలు భాగస్వామ్యం కావాలి

కవాడిగూడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధిలో కాలనీ, బస్తీ సంఘాలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. బీమానగర్ (ఎల్ఐసీ కాలనీ) కాలనీ సంఘం నాయకులు ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు వైఎల్ఎన్ కుమార్, ఉపాధ్యక్షుడు కె. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేష్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులను గోపాల్ సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు విశాల్, జాయింట్ సెక్రటరీ రేబాక జకారియా, కోశాధికారి కె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలనే హక్కు స్మితా సబర్వాల్‌కు లేదని, దివ్యాంగులను కించపరిచిన ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్‌ఫెడరేషన్(యూబీఐడీఈఎఫ్) అధ్యక్షుడు పి. రాజశేఖర్ రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎస్‌కు మంగళవారం మెయిల్ చేశారు. సివిల్స్‌లో దివ్యాంగుల కోటా అవసరమా అని ఎక్స్‌లో స్మితా సబర్వాల్ పోస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

టీజీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న
ఏపీ ఉద్యోగులను బదిలీ చేయాలి


ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ ఉద్యోగులు

ముషీరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న తమను ఆంధ్రాకు బదిలీ చేసేందుకు కృషిచేయాలని కోరుతూ టీజేఎస్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కోదండరాంను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉద్యోగులు వెంకట్రావు, సుధాకర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఏపీకి చెందిన వెయ్యిమందికి పైగా ఉద్యోగులను సొంత రాష్ట్రానికి బదిలీ చేసేందుకు సహకరించాలని కోరారు. ఉన్నత పదవుల్లో ఉన్న ఉద్యోగులకు ఆప్షన్లు ఇచ్చి కింద స్థాయి ఉద్యోగులను విస్మరించడం తగదన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌వోసీ పత్రం అందజేత

గోల్నాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సుందర్‌నగర్‌కు చెందిన ఎస్. ఆదిత్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న అతడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2 లక్షలు మంజూరైంది. ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదిత్య తండ్రికి గోల్నాక తులసినగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు బీఎంఎస్ కృషి


మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల పరిరక్షణకు భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కృషి చేస్తుందని సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు అన్నారు. బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని తిలక్‌భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవరావు, కుల్‌దీప్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులను పూర్తిచేయాలి


నల్లకుంటలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ యాకర అమృత అధికారులకు సూచించారు. మంగళవారం టీఆర్‌టీ కాలనీ, డాక్టర్ చారి వీధి, శంకరమఠం కూరగాయల మార్కెట్ వద్ద, శివం రోడ్ వీధితో ప్యాచ్‌వర్క్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


అభివాదం చేస్తున్న ఏఐటీయూసీ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం తదితరులు

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణగూడలోని యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కె. జమలయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు గిరాకీ లేక పూటగడవడమే కష్టమవుతుందన్నారు. ఆటో, క్యాబ్ చార్జీలు పెంచాలని, కొత్త ఆటో పర్మిట్లను జారీ చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు మోహన్‌రావు, ఎండీ ఇమ్రాన్, సామల భాస్కర్, చందు, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హెల్త్ డిపోగా కాచిగూడ ఎంపిక



ఆర్టీసీ ఉత్తమ హెల్త్ డిపోగా కాచిగూడ ఎంపికైంది. ఆర్టీసీ కళాభవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డును ప్రదానం చేసి ప్రశంసాపత్రం, రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రఘు, హెల్త్ వలంటీర్ రమాదేవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

కేంద్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

వివక్ష పూరితం



కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వివక్ష పూరితంగా, భవిష్యత్‌లో దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించేలా, గుంపు రాజకీయ పార్టీల పంపకంగా ఉంది. వికారాబాద్ నుంచి కృష్ణ వయా పరిగి కొత్త రైల్వే లైన్‌కు నిధులు కేటాయించకపోవడం బాధాకరం.

- పులిగారి గోవర్ధన్‌రెడ్డి, న్యాయవాదుల జేఏసీ కన్వీనర్

అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైనది



కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైనది. మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేశారు. మందులు, మెడికల్ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు సంతోషం.

- రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

బడా వ్యాపారులకే ప్రయోజనం



ప్రధాని నరేంద్ర మోదీ తన సీటును కాపాడుకోవడం కోసం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక కేటాయింపులు జరిపారు. ఆదానీ, అంబానీ వంటి బడా వ్యాపారులకు తప్ప ఈ బడ్జెట్‌తో ఎవరికీ ప్రయోజనం ఉండదు.

- అభిషేక్ కెన్నడీ, కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు

పేద, మధ్యతరగతి వర్గాలకు అనుకూలం

కేంద్ర బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా, వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా ఉంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. పట్టణాలలో పేదల ఇంటి నిర్మాణ కలను సొంతం చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. యువత, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారు. పన్ను చెల్లింపుదారులకు చేయూతనందించడం అభినందనీయం.



- డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు

ఉన్నత విద్యకు ప్రోత్సాహం



స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయం. రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఉన్నత విద్యను ప్రోత్సహించినట్లవుతుంది.

- వేదుల శాంతి, కేశవ మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



కేంద్ర బడ్జెట్‌లో ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేశారు. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ. 10 లక్షల ఎడ్యుకేషన్ లోన్ ప్రకటించడం వారి భవిష్యత్‌కు బాటలు వేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదే. విద్య, ఉద్యోగం, నైపుణ్యాల కల్పనకు రూ. 1.48 లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయం.

- పావని వినయ్‌కుమార్, గాంధీనగర్ కార్పొరేటర్

భూ విక్రయాలపై 12.5 శాతం పన్ను అన్యాయం



ఎన్డీయేలోని భాగస్వామ్య పక్షాల రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణకు నిధులు కేటాయించకపోవడంతోపాటు నూతన ప్రాజెక్టులు మంజూరు చేయకపోవడం అన్యాయం. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించకపోవడం బాధాకరం. భూ విక్రయాలపై 12.5 శాతం పన్ను విధించడం అన్యాయం.

- అచ్యుత రమేష్‌బాబు, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు

తెలంగాణపై వివక్ష

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు, తెలంగాణలో రైల్వే అభివృద్ధికి, లఘు పరిశ్రమలకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం.

- నల్లవెల్లి అంజిరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రాష్ట్రానికి అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం అన్యాయం. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా ప్రయోజనం లేదు. ఇలాంటి వారిని గెలిపించినందుకు సిగ్గుతో తలదించుకోవాలి.

- పోలే నిరంజన్, భారత రాష్ట్ర కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదు



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించలేదు.

- ఎం. నాగేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకుడు

యువత, రైతులకు పెద్దపీట

కేంద్ర బడ్జెట్‌లో యువత, రైతులకు పెద్దపీట వేయడం అభినందనీయం. ఏపీ రాజధాని అమరావతికి రూ. 15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం, హైదరాబాద్, బెంగళూరు కారిడార్ల ఏర్పాటుకు సహకరిస్తామనడం సంతోషం.

- పి. సాయిబాబా, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు

జలమండలిలో బదిలీలను ఆపాలి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తదితరులు

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జలమండలిలో జనరల్ బదిలీలను ఆపాలని కోరుతూ ఎండీ అశోక్‌రెడ్డికి వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో వర్షాలు, అత్యవసర సేవలు అవసరం అనే కారణంతో జలమండలిలో జనరల్ బదిలీలు చేయడం తగదన్నారు. జలమండలిలో కూడా వర్షాకాలంలో అత్యవసరపనులు ఉంటాయని, సిబ్బందిని ఇరిగేషన్ శాఖకు బదిలీచేయడం వల్ల జలమండలిలో సిబ్బంది కొరతతో సేవలు నిలిచిపోతాయన్నారు. బదిలీలను ఆపాలని తమ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి జలమండలి ఎండీకి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. బదిలీలను ఆపకపోతే వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎండీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నారాయణ, నాయకులు లక్ష్మీనారాయణ, జంగయ్య, డి. కొమురయ్య, అంజయ్య, ప్రేమ్‌కుమార్, యాదగిరి, శంకర్, వినయ్‌కుమార్, సాబేర్ పాల్గొన్నారు.

నటుడు చిన్నాకు కోడి రామకృష్ణ స్మారక పురస్కారం



నటుడు చిన్నాకు పురస్కారం అందజేస్తున్న వేణుగోపాలచారి

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ దర్శకుడు కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ప్రతి సినిమా వినోదంతోపాటు సందేశం మిళితమై ఉంటాయని కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రఖ్యాత దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాలచారి నటుడు చిన్నాకు కోడి రామకృష్ణ స్మారక పురస్కారం అందజేశారు. మాజీ పోలీస్ అధికారి సుంకర సత్యనారాయణ మాట్లాడుతూ.. చిన్నా.. పాత్రకు న్యాయం చేయగల నటుడు అని, కోడి రామకృష్ణ ద్వారా సినిమాకు పరిచయం అయ్యారని పేర్కొన్నారు. వెంకటరామకృష్ణ, జేఎల్ శ్రీనివాస్, బద్రినాథ్ చిన్నాకు అభినందనలు తెలిపారు. సంస్థ అధ్యక్షులు పుష్ప, కార్యదర్శి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా జయలక్ష్మి

బర్కత్‌పుర జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జయలక్ష్మి నియమితులయ్యారు. సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ శంకర్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఆస్పత్రిలో ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జయలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. మంగళవారం ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, ఫీవర్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఉపాధ్యక్షురాలు పద్మజ తదితరులు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అత్యాచారం కేసులో డ్రైవర్‌కు
20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ డ్రైవర్‌కు న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. కాచిగూడ సీఐ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రత్నానగర్‌లో నివసిస్తున్న ప్రవీణ్(28) డ్రైవర్. 2017లో ఓ బాలికపై అత్యాచారం చేశాడు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి పి. పుష్పలత మంగళవారం కేసును విచారించారు. నిందితుడు ప్రవీణ్‌కు 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా, జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని, బాధితురాలికి రూ. 4 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

షట్టర్ లిఫ్ట్ కేసులో నిందితులకు 9 నెలలు..

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షట్టర్ లిఫ్ట్ కేసులో నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. గత ఏడాది మార్చి 30న చిక్కడపల్లి మెయిన్‌రోడ్‌లోగల న్యూ బందర్ మిఠాయి బండార్, రాజీవ్ రెడ్డి స్వీట్ షాపుల్లో తిరుపతికి చెందిన రాజన్న, రేగుల రవి షట్టర్ లిఫ్ట్ చేసి చోరీకి పాల్పడారు. నిందితులను పోలీసులు గత ఏడాది నవంబర్ 3న అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నాంపల్లి కోర్టు న్యాయమూర్తి మంగళవారం కేసు విచారించి నిందితులకు తొమ్మిది నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

రైలు ఢీకొని వ్యాపారి మృతి

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడలో నివసిస్తున్న శంకర్(64) వ్యాపారి. మంగళవారం ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సప్తగిరి థియేటర్ వద్ద మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి చనిపోయినట్లు పోలీసులకు మంగళవారం సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎఫ్ కార్యాలయంలో
ఘనంగా దర్బార్ మైసమ్మ బోనాల ఉత్సవాలు

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయంలో గల దర్బార్ మైసమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉద్యోగులు బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ట్రస్టీ(సీబీటీ) సభ్యుడు మల్లేశం, పీఎఫ్ రీజనల్ కమిషనర్లు శివకుమార్, గౌరవ్ జగతి మాట్లాడుతూ.. ఉద్యోగులు ఐక్యంగా బోనాల ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల రాంబాబు మాట్లాడుతూ.. దర్బార్ మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్, సురేష్, సీతారామ్, అఖిలేష్, సత్య శ్రీనివాస్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.


బోనాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

మైసమ్మ ఆలయ బోనాల పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట మైసమ్మ ఆలయంలో ఈ నెల 28న బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం బోనాల పోస్టర్‌ను కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, బి. పద్మావెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల శివకుమార్‌తో కలిసి ఆవిష్కరించారు.

217-డి రూట్‌లో
10 ఎలక్ట్రిక్ ఏసీ మెట్రోలగ్జరీ బస్సులు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ప్రయాణికులకు మెరుగైన సేవలందించే దిశగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉదయం నుంచి 217-డి రూట్(పటాన్‌చెరు నుంచి దిల్‌సుఖ్‌నగర్)లో 10 ఎలక్ట్రిక్ ఏసీ మెట్రోలగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు మంగళవారం వెల్లడించారు. మియాపూర్-2 డిపో నుంచి 217-డి రూట్‌లో ప్రతీ 22 నిమిషాలకు ఒక ఏసీ మెట్రోలగ్జరీ బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పటాన్‌చెరు నుంచి వయా లింగంపల్లి, గచ్చిబౌలి, మెహిదీపట్నం, లక్డీకాపూల్, అబిడ్స్, గ్రామర్ స్కూల్, కోఠి, మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ఏసీ బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- పటాన్‌చెరు, లింగంపల్లి నుంచి మొదటి బస్సు ఉదయం 5 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.03 గంటలకు.
- దిల్‌సుఖ్‌నగర్ నుంచి మొదటి బస్సు ఉదయం 6.40 గంటలకు, చివరి బస్సు రాత్రి 11.53 గంటలకు.

అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు..
నేటి నుంచి ఛే నంబర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఛే నంబర్ వద్ద ఈనెల 24 నుంచి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకూ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

- ఛే నంబర్ నుంచి గోల్నాక వరకు వాహనాల రాకపోకలను అనుమతించరు. జిందా తిలిస్మాత్ వైపు మళ్లిస్తారు.
- గోల్నాక నుంచి ఛే నంబర్ వైపు ట్రాఫిక్‌ను అనుమతిస్తారు.
- ఎన్‌సీసీ గేట్ నుంచి ఛే నంబర్ జంక్షన్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులను తిలక్ నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఫీవర్ ఆస్పత్రి వైపు మళ్లిస్తారు.


గోశాలలకు పశు దాణా అందజేస్తున్న మహేష్ అగర్వాల్

గోశాలలకు దాణా అందజేత

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో గోశాలలకు పశుగ్రాసం, దాణా, మినరల్ మిక్చర్, బెల్లం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. గోవుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జోనల్ చైర్మన్ మహేందర్‌గుప్తా, సమర్పణ్ అధ్యక్షురాలు నిర్మలా సంఘీ, దీపక్, ప్రేమ్‌చంద్, మనోజ్, ప్రతాప్ నారాయణ సంఘీ పాల్గొన్నారు.

మోహిన్ చెరువు కట్టమైసమ్మ ఆలయంలో
బోనాలను సమర్పించేందుకు అనుమతి ఇవ్వాలి


ఓయూ ఎస్టేట్ అధికారి రాహుల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఓయూ పరిధిలోని మోహిన్‌చెరువు కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 28న బోనాలను సమర్పించేందుకు అంబర్‌పేట పరిధిలోని పలు బస్తీలకు చెందిన భక్తులకు అనుమతి ఇవ్వాలని కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఎస్టేట్ అధికారి రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, వెంకటరమణరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటం ఊరేగింపు



బోనాలను పురస్కరించుకొని అంబర్‌పేటలో మంగళవారం అమ్మవారి ఘటం ఊరేగించారు. ఊరేగింపునకు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి